# సుబ్బయ్యా మనవరాలు

## పి. రామలక్ష్మి

బారెడుపొద్దు. మూరెడు బాట. పొలాలగట్లు, ముళ్ళ తీగలు. చిన్నచిన్న నీలంపూల మొక్కలు. మొక్కల మీదనుంచి ప్రయాణిస్తూన్న చిరు గాలులు. చలిస్తూన్న ఆకులు, తెల్లతెల్ల మేఘాలు. మేఘాలనందుకుంటూ కొండలు. ఆ కొండలు ఎర్రటివి. ఆ దారి ఎర్రటి మట్టిబాట. సూర్యుడు ఎర్రగా చూస్తున్నాడు బాటకేసి. జంక్షన్‌లో నిలబడి సుదూరంలో కన్పిస్తున్న వూరివంక చూస్తున్నారా జంట. అందంగా వున్న జంటవైపు చూస్తోన్నారు చీలిన దారులవెంట వెళ్తున్న మనుషులు.

ఆ యువతి చెక్కిళ్ళు ఎండకు వాడిన తెల్ల గులాబీల్లా వున్నాయి. రేగిన కురులు ఎండాకాలపు మేఘాల్లా వున్నాయి. ఆమె కట్టుకున్న చీర నలిగిన ఎర్ర కలువపువ్వును గుర్తుకు తెస్తుంది.

ఆ అబ్బాయి వుంగరాల జుట్టు గాలితో ఆడుకుంటూంది. కళ్ళు ఎండవేడికి ఎర్రబడుతున్నాయి. బట్టలు హుందాగా వుండికూడా అక్కడక్కడ బస్ చేసిన మరకలతోవున్నాయి.

రావిచెట్టు మొదట్లో కొత్త సూట్‌కేసు ఎండకు మెరుస్తోంది. పేరు తెలియని ఎర్ర పూలచెట్లు రోడ్డు పొడవునా వెలిగించిన దివిటీల్లా నిలుచుని వున్నాయి.

ఒక పెద్దమనిషి వారిద్దర్నీ చూస్తూనే ఆగాడు నాజూకైన మనుషులు ఎవరికోసం ఎదురుచూస్తోన్నారో తనుక్కోవాలని కాబోలు.

ఆ కలవారి కుర్రాడు రెండుమూడు అడుగులు ముందుకు వచ్చాడు పెద్దమనిషి దెసగా.

"ఏమండీ! అదిగో ఆ కనిపించే కొండల దగ్గరి వూరుపేరు ఏమిటో కాస్త చెప్పగలరా?" అడిగాడు అర్థింపుగా చూస్తూ.

ఆయన కొంచం వింతగా చూస్తూ "అక్కడ మీకెవరైనా చుట్టాలున్నారా? లేక భూములేమైనా వున్నాయా బాబూ?" అనడిగాడు, అబ్బాయి ప్రశ్నార్థకంగా అమ్మాయి వైపు చూసాడు.

"ఏం అలా అడిగారు?" అంది మాటల్లోనే వారిద్దరి దగ్గరకు చేరిన అమ్మాయి. ఆమె చెవులకున్న ముత్యపు కమ్మలు కళ్ళల్లోని మంచితనంతో పోటీపడుతున్నాయి.

"ఏం లేదు ఆ వూరు కొండలకు దగ్గరగా వుంటంచేత బస్తీకి అటునుంచి ఒక దారి వుండటంచేత ఆ వూరిని అందరూ కొండదారి అని పిలుస్తారు. ఇంతా చేసి వూళ్ళో వంద లోగిళ్ళు వుంటాయేమో—అవైనా కాయకష్టం చేసుకునేవాళ్ళు కొండల్లో కాయకసురు తెచ్చి అమ్ముకునేవాళ్ళ గుడిసెలు మట్టిమిద్దెలు. అంచేత అడిగాను మీకెవరైనా తెలిసినవాళ్లున్నారేమో ననీ" ఆయన ప్రశ్నకు జవాబు అన్నట్లుగా తలవూపి "అక్కడికే వెళ్లాలండీ మేము" అంది అమ్మాయి.

"వెళ్దామా యిక?" అన్నాడు అబ్బాయి.

పెద్దమనిషి తాను వెళ్ళబోయే వూరిపేరు చెప్పి ముందుకు సాగిపోయాడు చేతిలో గొడుగును తిప్పుకుంటూ.

అబ్బాయి అమ్మాయికేసి చూసి చిరునవ్వు

నవ్వాడు. "మీ చుట్టాలున్న వూరు బస్తీకి దగ్గరే కాబోలు."

"అయినా వేరుగా ఎంత అందంగా కనబడు తోందో చూడండి'' అంది ఆమె.

"దూరపు కొండలు నునుపు అన్నారు."

"దగ్గరికొచ్చినా-గరుకుగానే వున్నా మనం పుట్టిన భూమిమీద వున్నామని వాటి మధ్యగా తిరగాలని వుంటుంది నాకు" ఆమె కళ్ళల్లో ఉత్సాహం ఎక్కువవుతోంది.

"ఊరు దగ్గర పడిందమ్మడూ! నీవాళ్ళు ఎలా ఆదరిస్తారో అని దడగా వుంది నాకు—" అన్నాడు హాస్యంగా అతను.

* * *

కొండదారి వూరు సమీపించారు ఇద్దరూ. ఎత్తు అరుగుల పెంకుటిళ్లు నాలుగయిదువుంటే, మిద్దెయిళ్లు మూడో నాలుగో వున్నాయి. మిగతా వన్నీ గుడిసెలే. వూరుమధ్యగా ఏదో దేవుడి మందిరం వుంది. బాగా చిన్నదిగా వున్న గుడి. ఆ గుడిచుట్టూ అరుగులు విశాలంగా పరుచుకొని వున్నాయి.

ఆవులను, మేకలమందను కొండమీదకు తోలుకుపోతున్నవాళ్ళూ, కాయగూరలు అమ్ముకొనేందుకు బస్తీవైపు బయలుదేరినవాళ్లు ఆ దారి వెంట వస్తోన్న కొత్త వ్యక్తుల్ని విచిత్రంగా చూడసాగారు.

అబ్బాయి భుజాలు ఎగరవేసి నవ్వుకుంటూ మధ్య మధ్య అమ్మాయి కళ్ళల్లో భావాల్ని వెదికేందుకు ప్రయత్నిస్తున్నాడు.

మామూలుగా అయితే ఎవరిదారిని వాళ్ళు వెళ్ళిపోయేవాళ్ళే కాని, ఆ కొత్తజంట వూరు మధ్యగా ఆగడం ఎవరికోసమో - దేనిగురించో వాకబు చేస్తూండడం గమనించి ముక్కుమీద వేలువేసుకుని ఒక్కొక్కరూ వారి చుట్టూ చేరుతున్నారు.

ఆడవాళ్ళు పనులు మానుకున్నారు. పిల్లలు ఆటలు మానుకున్నారు. నిరాటంకంగా నిర్మోహమాటంగా నడివీధిలోకొచ్చేశారు విశేషమేమిటో తెలుసుకునేటందుకు.

వాళ్ళ అబ్బురాన్ని గమనిస్తూ ఆ అబ్బాయి ముందుకు నడిచి—వయసుస్సులో పెద్దవాడుగా కన్పిస్తున్న ఒక వ్యక్తిని అడిగేడు. "ఏమండీ! ఇక్కడేదైనా చిన్న ఇల్లు అద్దెకు దొరుకుతుందా?"

ఆ మనిషి మరింత ముందుకొచ్చి అబ్బాయి ముఖంలోకి ముఖంపెడ్తూ "నీ పేరేంటయ్యా!.. వూళ్ళో మీ సుట్టాలు లేరా?" అని తిరిగి ప్రశ్నించాడు.

"లేరండీ కాని ఎప్పుడో వుండేవాళ్ళు.." అని నసిగాడు అమ్మాయివంక కొంచెం కోపంగా చూస్తూ.

ఆ అమ్మాయి నవ్వుకుంది.

"అయితే వెంకయ్యాగారని పెద్ద డబ్బున్నాయనోరు బస్తీలో వుండేవోరు. మనూర్లో ఆరి కోయిల్లుండేది. అడపాదడపా వొచ్చేవోళ్లు లెండి. ఆరికి మీరేవన్న సుట్టాలా?" అడిగాడా పెద్దమనిషి.

"కాము" అన్నాడు అబ్బాయి విసిగిపోతూ.

"తమరిపేరో?"

"రాజశేఖరం" అన్నాడు మీసం మెలివేయడ మొకటే తక్కువన్నట్టు అమ్మాయి వంక గొప్పగా చూస్తూ. "అయితే తమరు బ్రేమ్మర్లా" అన్నాడాయన ఏదో తప్పుచేస్తున్నట్టు చూస్తూ.

"కాదు. రాజులం" అన్నాడు.

మధ్యలో అందుకుంటూ "మనం రాజులమా?" అందా అమ్మాయి చిరుకోపంతో. "రాజుల్లాంటివాళ్ళం."

"మా వాళ్ళు పల్లెటూరివాళ్ళని మాటిమాటికి ఎగతాళి చెయ్యకండి" అంది అతనికి మాత్రమే వినిపించేట్టు.

"అయితే బాబూ! మీరు నాయుడోరా? ఈ వూల్లో కొన్నాళ్లుండేవోరు ఒక దొరబాబుగోరు.- ఆరి కొడుకు మిలిట్రీలో సేరిపోయిండని ఇరక్తి మీద ఎటో ఎల్లిపోయినాడు." మరో వ్యక్తి ఐశ్వర్యం చేసుకుని అడగవచ్చాడు.

"కాదండీ. మేం సేనాపతులం. రాజులకి దగ్గరివాళ్ళం. మీకు బోధపడాలని అలా చెప్పా"

అన్నాడు రాజా.

ఇక లాభం లేదనుకుని ముందుకు వచ్చింది ఆ అమ్మాయి. "నా పేరు సీత. మే విద్దరం భార్యాభర్తలం. మా ముత్తాతగారు ఈ వూళ్లో వుండేవారు. ఆయనకి నేనో మునిమనవరాల్ని. అంచేత ఈ వూళ్లో కొన్నాళ్ళు గడపాలనే ఉద్దేశంతో వచ్చాను మా వారితో కూడా కలసి " అని అన్నది.

సీత నోట్లో మాట వుండగానే "గురుతొచ్చిందమ్మ! గురుతొచ్చింది " ఓ మనిషి చెప్పడం మొదలుపెట్టేడు.

"సుబ్బయ్యగారని ఒక మగానుభావుడు మన పొరుగూరు రామాపురంలోనే వుండేవోరంటమ్మా. ఆనకీ వూరంట ఒక పెద్ద యిల్లు వున్నది. దగ్గిరే పొలాలు వుండేయి. ఆ రోజుల్లో సదువుకున్నోరు తక్కువగద. అయినా ఒక్కతే కూతురని బస్తీలో వుంచి బసలోపెట్టి సదివిస్తాండు. ఇంతలోపు ఆయమ్మ ఎవుర్నో పెల్లాడిందని టెలిగ్రాఫ్ వొచ్చిందండమ్మ. అంతే కులపోడు కాదో యేంటో — అయ్యా అమ్మా బెంగెట్టుకున్నారు. ఆ స్తిపాస్తుల్ని అనుభవించే రాత వుండాలగదయ్యా, కూతుర్ని రావద్దంటూ సెప్పేసినా —ఆళ్ళు సాన్నాళ్ళు బతకలేకపోనారు. దిగుళ్ళతోనే సచ్చారుబాబూ. వయసు నిండకముందే ముసలి ఎద్దుల్లా కుంగిపోనారు "

రాజశేఖరం, సీతలతో పాటుగా చుట్టూ వున్నవాళ్ళుకూడా కొత్తగా వింటున్నట్టు శ్రద్ధగా నిలుచున్నారు.

"ఈ ఎండలో ఏంటయ్యా! ఆ మందిరంలో కూకోమను బాబుగోర్ని..." అన్నాడు గుంపులో ఒకడు. "సరి! సరి!" అని అందరూ మందిరం నీడలోకి వెళ్ళారు. అరుగులమీద కూర్చున్నారు కొందరు.



"ఇంతకూ ఆరుపోనాక ఆ స్తిపాస్తుల్ని ఐందుగులట్టుకుపోనారు...కూతురు మాత్తరంవు తండ్రి ఆస్తి వొద్దన్నాదని సెప్పుకుంటా వుండారు. కానీ ఇప్పుడా కూతురుకి కూతురులు మల్లా వున్నారని సెప్పుకుంటా వుండారు. ఎది నిజంవో కాదో మాకు తెలిసిందికాదు ఈ యమ్మమరి?" ఆ రైతులాంటి పెద్దమనిషి మాటకు అడ్డువస్తూ "మీరు చెప్పిన సుబ్బయ్యగారు ఈవిడకి ముత్తాతగారు అవునో కాదోగానీ —— ఈమెకుకూడా అటువంటి తాత గారే ఒకరుండేవారు గతంలో " అన్నాడు రాజశేఖరం.

సీత నవ్వుకుంరి. వూరందరూ సంతోషించారు.

అంతలో ఒక ఆడమనిషి విచారంగా మారిన ముఖ కవళికలతో చెప్పసాగింది "సుబ్బయ్య బాబుగోరి పేరుమీద ఒక యిల్లు మాత్తరంవు ఈ వూల్లో వుండిపోనాది బాబూ! నాలుగదుల సావిడి. మా ఆడోల్లం తీరినప్పుడంత సుబ్బరంగా సిమ్మ్రుతాం. సున్నంవేత్తాము కాని అందంట మా వుండగలంవా బాబూ! పక్కూర్లా పెసిడెంటోరు ఈడ్నే పిల్లకాయలకి బడి ఎడతా నంటాండు. ఉప్పుడికి మాత్తరం తాళంవెట్టి బద్దరంగుంది "

"మీరు అందులో వుంటే పసందుగా వుంటాది బాబూ! మా ఆడది అదే అంటాంది" అన్నాడు మొదటిమనిషి.

రాజశేఖరం ఆశ్చర్యపడ్డాడు. "మేము ఈ వూళ్ళో ఒక నెలగానీ, నెల పదిహేనురోజులు గానీ గడుపుదామని వచ్చాము. నన్నూ, మీ సుబ్బయ్య మనవరాలైన ఈ సీతనీ ఈరోజు మీరు ఆదరించినట్టే ఇకముందుకూడా ఆదరిస్తే మా కదే పదివేలు" అన్నాడు చేతులు జోడించి అందరికీ నమస్కరిస్తూ.

అందరూ పొలోమని లేచారు. ఇల్లు బాగు చేస్తామంటూ ఆడాళ్ళు ఒకరిద్దరు హడావిడిగా వెళ్ళారు. కాఫీగాని పంచదార నీళ్ళుగానీ తేవడానికి కొందరు ఆయత్తమైతే, ఆగంతుకులకు ఆతిధ్యమెలా నెరపాలని తబ్బిబ్బుపడ్డారు మరి కొంతమంది. ఆ కొండదారి గ్రామవాసులకు అట్టే శ్రమ కలిగించడం యిష్టంలేని సీత తమ యిల్లు చూపితే చాలు స్వయంపాకం తనే చేసుకుంటుందని తెలియజేసింది వారికి. అంతా కొత్త ఉత్సాహం వెల్లివిరిసింది ఆ చిన్న గ్రామంలో.ఎందరెందరో అవసరార్థం సుబ్బయ్య గారింటిలో దిగి కొన్నాళ్ళు గడిపివెళ్ళేవాళ్ళు. వాళ్ళెవ్వరూ తీసుకురాని అందం సీత తెచ్చిందని ఊరంతా ఒక్కుమ్మడిగా అనుకున్నారు.

సుబ్బయ్యగారిల్లుకావడానికి పెంకుటిల్లయినా లోపలివి మట్టిగదులు. పేడతో అలికి ముగ్గులు పెట్టిన యింటిలో తడి ఆరని గదుల్లో దుప్పట్లు ఎలా పరుచుకోడమా అని రాజా ఆలోచిస్తూంటే ఒకరు నులకమంచం మరొకరు రెండు పొడవైన చాపలు పట్టుకుని వచ్చారు. "మజ్జిగ తాగండి బాబు! మా వూర్లంట ఇదే దొరుకుద్ది. కాఫీలకంటె పక్కూరికైన పోవాల. లేదంటే బస్తీకైనా ఎల్లాల" అన్నాడొక కుర్రాడు తళతళలాడే గాజుగ్లాసుల్లో మజ్జిగ నింపి అందిస్తూ.

సీత రాజావంక అర్థవంతంగా"చూశారా? అన్నట్టు చూసింది.

రాజా చేతికి గ్లాసులు అందిస్తూ పక్కకు తిరిగి అరుగుమీదనుండి వుమ్మేడు ఆ కుర్రాడు. రాజా కళ్ళు చిట్లించుకున్నాడు. సీత గతుక్కుమని—అంతలో చిన్నగా నవ్వింది.

ఆ అబ్బాయి, మిగతావాళ్ళు వెళ్ళాక "మనలాంటివాళ్ళకోసం అన్నీ శుభ్రంగా వుంచాలని అనుకుంటారు వీళ్ళు, కానీ మనం వేటిని అసహ్యించుకుంటామో వీళ్ళు బొత్తిగా వూహించలేరు. మనం నోరువిప్పి చెబితేగాని అర్థంకాదు. మన చిన్నచిన్న అసహ్యాలు వీళ్ళసలు కేర్ చేయరు" అంది సీత.

"అంతలా వెనకేసుకు రాకు అప్పుడే బోర్ కొడుతోంది నాకు" అన్నాడు రాజా ఆవలిస్తూ.

ఆ రోజు ఏదో అన్నం చారు మాత్రం వండుకుని వెంటతెచ్చుకున్న పచ్చడితో భోజనం ముగించారు భార్యాభర్తలు.

ప్రొద్దున్న ఆరు గంటలకు లేచిన రాజా

బ్రష్షు తీసుకుని వీధి అరుగుమీదకు వచ్చేసరికి కళ్లాపిజల్లిన వాకిట్లో ముత్యాలముగ్గులు కళకళ లాడుతూ కళ్యాణ గీతం పాడుతున్నాయి.

అక్కడ దంతధావనం చెయ్యలేక పెరటి కేసి నడిచాడు. ఒక కుర్రాణ్ని తోడు తీసుకుని బస్తీకి వెళ్లాడు. కాయగూరలు వంటసామగ్రి తీసుకుని వచ్చేసరికి సీత వంటచెరకు సమ కూర్చుకుంది.

"కట్టెలుకొట్టి తెచ్చేశావా అప్పుడే?" అనడి గాడు రాజా ఆశ్చర్యం నటిస్తూ.

"ముందా సంచుల్లోవి కింద దిమ్మరించితే రాజా వారికేం ఆదరువులు కావాలో తెలుసు కుంటాను." అంది సీత పొయ్యిముందు పీట వేసుక్కూర్చుని.

* * *

సీత, రాజాలు ఆ వూరొచ్చి పదిరోజులు సునాయాసంగా గడిచిపోయాయి. ఆ పల్లెటూరి ప్రజల ఆదరణలోనే వాళ్ళ అన్ని అవసరాలు గడిచిపోతుండేవి. డబ్బుతీసి యివ్వడం తరు వాయిగా ఆఘమేఘాలమీద అన్నీ యింటిలో అమిరిపోయేవి.

ఆ రోజు వెన్నెలరోజు. పనులన్నీ అయిన తర్వాత ఆరు బయట ఎత్తు అరుగుమీద ఇద్దరూ కూచున్నారు.

వేసవికాలం అయినా చంద్రుడు ఆకాశాన్ని చలువ పందిరిగాను, భూమిని నదీతీరంగానూ మార్చేశాడు. ఎదురుగా వున్న గుడిసె ముందు ఉత్సాహంగా మేదరిపని జరుగుతోంది. వెన్నెల వెలుగులో కూర్చుని శుణాలమీద బుట్టలు తడి కీలు అల్లి పడేస్తున్న వాళ్ళ హస్తనైపుణ్యాన్ని వేడుకగా చూస్తున్నారు.

చేతికి మాత్రమే పని కాకుండా నోటికి కూడా అవిరామంగా పని కల్పిస్తున్నారు. వాళ్ళ గందరగోళపు భాషలో ప్రపంచ విషయాలన్నీ


## మీరు మెచ్చే పుస్తకాలు

| | |
|---|---|
| జీవన స్వప్నం—చివుకుల పురుషోత్తం | 12-00 |
| అదిగో పులి—మల్లాది వెంకటకృష్ణమూర్తి | 12-00 |
| జీవన పోరాటంలో - ఆశల ఆరాటం—పి.వి.ఆర్. శివకుమార్ | 10-00 |
| ప్రేమించడం ఎందుకు—విమలారామం రామచంద్రరావు | 10-00 |

భారత దేశంతో సహా ప్రపంచం మొత్తం లక్షల లక్షల కాపీలు
అమ్మిన ఉత్తమ నవలల, కదంబం

**పాత కెరటాలు — మాలతీ చందూర్ 12-00**

| | |
|---|---|
| దృష్టి—ఎన్. ఆర్. నంది | 10-00 |
| సీత— ,, | 10-00 |
| రెక్కలు - చుక్కలు—మాలతీ చందూర్ | 10-00 |
| చంపకం - చదపురుగులు— ,, | 7-00 |
| రేణుకాదేవి ఆత్మకథ— ,, | 7-00 |
| ప్రేమ కావాలి—విమలారామం | 7-00 |

## నవయుగ బుక్ సెంటర్
ఏలూరు రోడ్—విజయవాడ-2

పరిభ్రమిస్తున్నాయి.

చూస్తూ వింటూ నవ్వుకుంటున్నారు. ఓ పన్నెండేళ్ళ అమ్మాయి పరుగు పరుగున అక్కడికి వచ్చి వాలింది. "మల్లెదండమ్మా!" అంది పొడవాటి దండను సీత కిస్తూ.

"చిట్టీ! ఎక్కడివే నీకు మల్లెపూలు?" విస్తు పోతూ అడిగింది.

"మా యమ్మ మీ కిచ్చి రమ్మందమ్మా!" ఆ పిల్ల వొంటిమీద చీరముక్క చుట్టుకొని వుంది. "మరి నువ్వు పెట్టుకోవూ?" అడిగింది సీత ఆ పిల్ల పూలు కట్టిన పిలక జడకేసి చూస్తూ.

"ఎట్టుకుంటానమ్మా! గాని మాయమ్మ అన్నిపూలు ఇయాల మీ కిచ్చీమన్నాది."

"అన్నీ అయితే ఎట్టుకోనని చెప్పు. ఇంద" చిన్నముక్క పంటికొనతో తుంపి చిట్టికిచ్చి మిగిలినది తన సిగచుట్టూ పెట్టుకుంది. చిట్టి గెంతుకుంటూ పరిగెట్టింది.

రోజులు అలా క్షణాల్లా ఆహ్లాదంగా గడుస్తున్నాయి సీతకు. రాజా కూడా మొదటిలా విసుగుదల చూపటంలేదు.

ఉదయం కోడి మూడింటికే అలారం కొడుతోంది. మరో రెండు గంటలాగి కాకులు ఉషోదయ గీతికలు ఆలపించసాగాయి. ఆ కంఠాలు అంత సుఖంగా లేకనేమో జనం మేలుకుంటున్నారు. సీత రాజాలకు ఏడింటికిగాని తెల్లారదు.

ఎందుకో ఆరుకే మెలుకువ వచ్చి లేచాడు. అతని కళ్ళు అప్రయత్నంగా పెరటి తలుపు కేసి చూసి నిశ్చలంగా నిలబడిపోయినయి. గుండె జారింది. పక్కన మంచి నిద్రలోవుంది సీత. తలుపు ఎవరు తీసివుంటారు?

రాజా గబుక్కున లేచి పెట్టెలుంచిన రూములోకి వెళ్ళాడు. గది బోసిగా వుంది. పెట్టెల్లేవు. అందులోనే కదా మరి క్యాష్ వున్నది.

రాజాకు అంత చల్లని ఉదయంలో కూడా కంగారుతో కోపంతో వొంటినిండా చెమట్లు పోసేయి.

దొంగలమీది కోపమంతా సీతమీదకు మళ్ళింది. ఆ కోపంలో ఎప్పుడూ అలా లేపని వాడు అదమరచి నిద్రపోతున్న సీతను లేపి కూర్చోబెట్టి జరిగినదంతా కళ్ళారా చూడమన్నాడు.

"ఏవిటేవిటి?" అంటూ కంగారుగా కూర్చుంది. అంతా చూశాక సీతకి నోరు పెగల్లేదు. అతని కళ్ళల్లోకి సూటిగా చూడలేకపోయింది. మంగళసూత్రం మెడలో బంగారు గొలుసు క్షేమంగా వున్నందుకు సంతోషించింది

"ఆఖరుకు బుద్ధి పోనిచ్చుకున్నారు కాదు" అన్నాడు రాజా పళ్ళు నూరుతూ. కోపాన్ని యింకా యెలా వెళ్ళగక్కాలో తెలీలేదు.

సీత ఏమనకుండా తల వంచుకుని వొకవైపే చూస్తూ ఆలోచిస్తూంది. రాజా అదంతా తనతప్పే అన్నట్టు పిచ్చివాడిలా యేదో అంటాడని తెలుసు. అందుకని తను నోరు మెదపకుండా వూరుకుంది. ఇప్పుడెలా? అనే ప్రశ్న మస్తిష్కంలో మెదులుతూంది ముఖ్యంగా.

సుబ్బయ్యగారింట్లో దొంగలు పడ్డారు అనే వార్త చిచ్చులా రేగింది వూళ్లో. జనమంతా ఇంటిముందుకు జాతరలా చేరారు.


"ఈ వూరంటె ఎవుడు చేసుంటే రేతిరి కంత ఆడినేతులు పడిపోతయ్" అని దీవించారు గుంపులో కొందరు.

"మనూళ్లో ఎవుడికే దమ్ములు ఈపాడు పనికి. ఇదంతా ఆ కొండోల్ల పనే " అని చెయ్యెత్తి కొండలమీదకు చూపించాడు ఒకడు.

"అవునవును." సుమారుగా అందరూ ఒక అభిప్రాయాని కొచ్చారు.

"దొంగచచ్చినోళ్ల వుసురుపోసుకుండారు." తిట్లు గాలిలోకి తేలిపోయాయి. వూళ్ళో అడుగు పెట్టిన నాడు మొదటగా పరిచయమైన భీమయ్య ముందుకొచ్చి ఒకేమాట ఖండితంగా చెప్పాడు.

"బాబుగోరు మనూళ్లో నెలదినాలుంటానికి వొచ్చుండారు. జరిగిపోనాది దొంగతనం. ఇక నుంచి మనఁవే ఆర్ని సూసుకోవాలి. అంతే పదండి."




బిలబిల మంటూ వెళ్ళిపోయారు.

కాస్సేపటిలో కట్టెపుల్లలు నుంచి కాఫీ పొడుంవరకు అన్నీ అమిరాయి. ఇంట్లో కొన్ని వస్తువులు వున్నాయని సీత చెప్పినా ఎవరూ విన్పించుకునే ధోరణిలో లేరు. రామన్న అనే అతను వాళ్ళ స్వంతపంట అని చెప్పి బస్తా బియ్యం యింట్లోపడేసి వెళ్ళాడు.

వండేందుకు బియ్యం చాటలోకి వొంపు కున్న సీతకళ్ళు చారెడయ్యాయి.

మల్లెపూవుల్లా వున్న బాగుచేసిన సన్న బియ్యం అవి. వెదికి చూచినా ఒకరాయి కన్పించలేదు.

"మేం పండించుకున్నవి ఇయ్యేనమ్మా. ఇయ్యాల వంగ తెంపినం రేపు దొండకాయలు, పొట్లబీరకాయలు తెచ్చి యిస్తానమ్మగోరూ" అంటూ తెల్లగా పొడుగ్గావుండి తలపాగా చుట్టు కున్న ఓ మనిషి తెచ్చియిచ్చాడు సంచితో కాయగూరలు.

మామూలుగా నీళ్ళు తోడిపోయడానికి వచ్చిన మనిషి—"నేను డబ్బుకాక్కాదమ్మ-నీళ్ళు పోసేది. మా సుబ్బయ్యగారి మనవరాలిగోరికి డబ్బుల్తీసుకుంటనా?" అని చెప్పింది.

సీత వాళ్ళ అవ్యాజానురాగాన్ని చూసి నోరు మెదపలేకపోతోంది. కృతజ్ఞత ఎలా చెప్పుకో వాలో తెలియడంలేదు.

బస్తీ హోటలు నుంచి కావల్సినవి అడగక పోయినా కుర్రాళ్ళు తెచ్చిపెడుతున్నారు. బొటా బొటిగా సంపాదించుకునేవాళ్ళు ఇంత తెగించి ఎలా ఖర్చుపెడుతున్నారు అని ఆశ్చర్యపడటం రాజా వంతు అయింది.

అప్పుడప్పుడు రాజా కొండలమీదకి కుర్ర వాళ్ళతో కలిసి షికారు వెళ్తుంటాడు. ఒక రోజు సీత, రాజా కొండమీదకు జంటగా బయలుదేరారు.

ఒక చెట్టుకింద కూర్చుంటూ "చూశావా?- మా వాళ్ళు ఎంత మంచివాళ్ళో?" అంది. ఆమె పక్కనే కూచున్నాడు రాజా. "వీళ్ళకు లోపల ఏమైనా ఆశలున్నాయేమో ?" అన్నాడు.

"ఇక వీళ్ళను కష్టపెట్టడం బావుండదు. రెండురోజులుండి వెళ్ళిపోదాం" అంది సీత సాలోచనగా.

"నిజంగా చెప్తున్నా-నేననుకున్నంత బోర్‌గా లేదిక్కడ."

సీత చూపులో గెలుపు మెరిసింది.

"మరి వెళ్ళేందుకు డబ్బో? "

"నా వుంగరం ఎవరి దగ్గరన్నా తాకట్టు

పెడతాను? లేదా వీరి దగ్గర డబ్బు తీసుకుని వెళ్ళాక తిప్పి పంపేద్దాము-మనకోసం నీళ్ళు ఖర్చుచేసిన డబ్బుతోసహా" అంది సీత.

ఒక నిర్ణయాని కొచ్చారు.

ఇంటికి వచ్చిన తరువాత కర్రలపొయ్యి వెలిగించే పనిలో పడింది. రాజా అరుగుమీద స్తంభానికానుకుని సిగరెట్టు కాలుస్తూ వీధి దృశ్యాలు చూడసాగాడు. పిల్లలు గోళీకాయ లాడుకుంటున్నారు. దొంగాట పేరుతో-పరు గులు తీస్తున్నారు. ఆడాళ్ళు వంటసన్నాహాల్లో వున్నారనేందుకు నిదర్శనంగా గుడిసెల మీదుగా సన్నసన్న పొగలు లేస్తున్నాయి. ఊరి బావి దగ్గర ఇంటికోసం ఆడవాళ్ళు నీళ్ళు మోస్తు న్నారు. కొందరు మగాళ్ళు నూతిపక్కగావున్న నాపరాళ్ళమీద నిలబడి బాల్చీలతో నీళ్ళు ఒంటి మీదకు దిమ్మరించుకుంటున్నారు. ఆడపిల్లలు అరుగుమీద నిలబడి కట్టె దువ్వెనలతో పేలు నొక్కుకుంటున్నారు.

ఇంకాస్సేపటికి మునిమాపు అవుతుంది. చీకట్లు బాగా ముసురుకుంటాయి. దూరంగా వున్న కొండలమీద ఎర్రని మంటలు అక్క డక్కడ కనిపించి చీకటి వెలుగుల గూర్చి మనుషులకి ఆలోచింపజేస్తాయి. చీకటి మూగిన కొండలమీద ఎర్ర ఎర్రని మంటల్ని చూడటం కోసం రాజా అలా నిలబడుతూ వుంటాడు.

పరధ్యానంగా నిలబడిన రాజా మెట్లెక్కి వచ్చి నిశ్శబ్దంగా పక్కన నిల్చున్న శాస్త్రీని చూడలేదు. చివరికి ఆ వ్యక్తి అతని భుజం మీద వొక్క చరుపు చరిచేసరికి తుళ్ళిపడి ఇహంలోకి వచ్చాడు.

"ఒరే! శర్మా! నువ్వెప్పుడొచ్చావోయ్ " రాజా ఆశ్చర్యపోయి అడిగాడు.

"ముందు నీ సంగతి చెప్పవోయ్ కొత్త పెళ్ళికొడుకువి వదినగార్ని విడిచి యిక్కడ అజ్ఞాతవాసం చేస్తున్నావేంటి?—"

"లక్ష్మణుడిలా నువ్వొచ్చావు కొబట్టి ఇది అజ్ఞాతవాసం కాదోయ్ ఇక— మీ వదినతో కలుపుకుంటే వనవాసమే యిది. ఒక్కటే తేడా—ఈ వనవాసానికి కారకులు కైకగాని మంధరగాని కాదు. మీ వదినగారి ప్రోద్బలం" అన్నాడు రాజా హాస్యధోరణిలో.

"బలె బలె" అంటూ నివ్వెరపోయాడు శర్మ. రాజా కాలేజి జీవితంలో శర్మ వొక ఫ్రెండు. శర్మ యివాళ చింతపండు చవుకలో బేరంచేసి కొనడానికి వచ్చాడు. ఎవరికో చెప్పేసి వెళ్తుండగా అరుగుమీది నిలబడివున్న రాజా కనిపించాడు.

లోపలినుంచి సీత వచ్చింది. రాజా స్నేహి తుడిని పలుకరించింది. సీత లోపలికివెళ్ళి కాఫీ తయారుచేసి వారిద్దరికీ యిచ్చి తనుకూడా తీసు కుంది. ముక్కాలి పీటలమీద కూర్చుని సాయంకాలపు చల్లని వెలుగులో వచ్చేపోయే వాళ్ళను చూస్తూ మాట్లాడుకుంటున్నారు.

ఒక్కొక్కరూ సుబ్బయ్యగారింటి అరుగు దగ్గరకు చేరసాగారు. కొత్త వ్యక్తి వివరాలు కావాలి వాళ్ళకు. కాని అడిగేందుకు వెళ్ళలేక పోతున్నారు. ఇంతలో బస్సునుంచి అప్పుడే తిరిగి వచ్చిన భీమయ్య ఆ దారిలోనే వెళ్తూ— రాజా దగ్గిర కూర్చున్న కొత్త వ్యక్తిని చూసి ఆగిపోయి మెల్లగా దారితీశాడు అటువైపుకు. అంతవరకు తటపటాయిస్తున్నవాళ్ళు అతన్ని వెన్నంటివెళ్ళారు.

"బాబుగారూ! ఈయన మీ బంధువులా?" అనడిగేడు భీమయ్య.

"రా! భీమయ్యా రా! కూర్చో ఇతను నా స్నేహితుడు శర్మ—కలెక్టరాఫీసులో పనిచేస్తు న్నాడు—ఈయన ఈ వూరి పెద్ద. దగ్గర్లో భూములున్నయి" పరస్పరం పరిచయం చేసాడు రాజా.

తలపాగా విప్పి గచ్చుమీద దులిపి, అక్కడ కూర్చున్నాడు భీమయ్య. చుట్టూ మిగతావాళ్ళు కూర్చునీ నిలబడీ విడ్డూరంగా చూస్తున్నారు శర్మవంక.

వూళ్ళో సంగతులు మాట్లాడుకున్నారు. క్షణం ఆగి రాజా అన్నాడు. "ఇన్ని రోజులుగా మీ వూరందరి ఆదరణ పొందాము భీమయ్యా!

ఇంక ఒకటి రెండు రోజులలో వెళ్ళిపోతు న్నాము."

భీమయ్య తెల్లబోయి చూశాడు. "అదేం విటి బాబూ! మీరు నెలరోజులుపైగా వుంటాని కొచ్చివుండారు. వారంరోజు టయాం వుంది బాబు యింకా ఏదో బాబూ! సుబ్బయ్యగారి మంచితనమేగాని సుబ్బయ్యగార్ని మేం చూసుండలేదు. ఈ ఊరి రామమందిరం కట్టించినారంట. పేదోల్లకి దానదరమాలు చేసినారంట. దేవుడ్లాటోరంట ఉప్పుడా సుబ్బయ్య గోరి మనవరాలిగోరికి మేం కాసింత చెయ్య లేకపోతే మా మనుసుంటదా బాబూ?".

శర్మ ఒక క్షణం ఆగి గొంతు సవరించుకున్నాడు. భీమయ్యవైపు చూసి "నీకు కష్టం కలగొచ్చు—ఒకమాట చెప్పాల్సి వచ్చినందుకు బాధగానూ కొంచెం భయంగాను వుంది భీమయ్యా!—" అన్నాడు.

"ఏంటయ్యా అదీ?—" భీమయ్య జరిగాడు ముందుకు.

"మా రాజాని మీరు క్షమించాలి. మీరంతా అనుకుంటున్నట్టు సీత మీ సుబ్బయ్యగారి మనవరాలుకాదు రాజా ఒక లక్షాధికారి కొడుకు. సీత భాగ్యవంతుల అమ్మాయి. వీరిద్దరికీ నెల రోజుల క్రితం పెండ్లయింది. కొత్త దంపతులు కొన్నాళ్లు విహారయాత్ర చేస్తుంటారు. హనీమూన్ అంటాం మేము ఇంగ్లీషులో. అలా సీతగారు—పెద్ద సిటీల్లో తిరగడంకంటె మీ వంటి గ్రామీణ ప్రజలమధ్య తిరగాలని, కలిసి మెలిసి కొన్నాళ్లు గడపాలని కోరుకున్నారు. అందుకనే సుమారు మూడు వందలమైళ్ళ దూరంనుంచి వచ్చి ఈ పల్లె ఎంచుకొని ఇన్నాళ్లుగా మీతో వున్నారు. మీ ఆదరణకి వాళ్లు పొంగిపోతున్నారు. సీతగార్ని మీరు మీ సుబ్బయ్య మనవరాలిగా భావించుకున్నా వాళ్ళకేమీ అభ్యంతరం లేదు మీకు వాళ్ళ కృతజ్ఞత తెలుపుకుంటున్నారు."

శర్మ చెప్పినంతసేపు రెప్పవేయక నివ్వెరపోయి విన్నారు. అయినా కొంతసేపటికిగాని


బాధారహిత ప్రకృతిసిద్ధమైన ఆరోగ్యము మీదే!
స్త్రీల బాధలు ప్రత్యేకమైనవి
లోధ్ర
75 సంవత్సరములకు పైగా
సుఖజీవనమునకు
లోధ్ర టానిక్‌ను
వాడిన స్త్రీలు ఎందరో!
ఉచిత వైద్య సలహాకు
ఈ క్రింద పేర్కొనబడిన విలాసమునకు
ఈ కూపన్‌ను పూర్తిచేసి మీ జాబుతో పంపండి.
పేరు, ____________
విలాసము: ____________
____________ PIN ____________




కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్ రాయపేట, మద్రాసు-14
ఏజంట్లు: శీతారామ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్ విజయవాడ — సికింద్రాబాద్.

అంతా అర్థంకాలేదు. ఏమేమో గుసగుసలు వెలరేగాయి. మొదట తేరుకున్న భీమయ్య అందిర్నీ మందలించి "సీతమ్మగారు మా మజ్జకి వొచ్చినారంటే మాకెంత గరువం బాబు గారూ! మా సుబ్బయ్యగారి మనవరాలుగోరు కూడా ఇట్టానే వుంటారేమో ఎవరి కెరుకవుతది? ఈ దయ సాలుబాబు మాకు! అరు మీరు పది రోజులు ఈ ఊల్లో వుండాలి బాబూ! అదే మా కోరిక. లేకుంటే మాకు సంతుష్టవదు" అన్నాడు.

"అంతే—అంతే" అంటూ వంతపాడారు వెనకనున్నవారు.

"మరోమాట. నేను ఊరెళ్లాక మీకు బహు మతిగా కొంత సొమ్ము పంపిస్తాను. దాన్ని మీరు ఈ గ్రామాభివృద్ధికి ఉపయోగించండి." అన్నాడు రాజా.

"ఒద్దు బాబూ! మీరేమిచ్చినా మాకు కష్టమే స్తది. సీతమ్మగారు సుబ్బయ్యగారి మనవరాలుగారే అనుకుంటాం బాబూ" అన్నాడు మరో నడివయసు రైతు.

"మీరే(విచ్చినా — అల్లదుగో సుబ్బయ్య గోరు కట్టిచ్చిన రామ్మందిరంకే ఎట్టండి" అన్నాడు ఒక కుర్రాడు.

"సరే మీ పేర్న మందిరం గోపురం బాగు సేయిస్తాం."

వాళ్ళంతా తమలోతాము మాట్లాడుకుంటూ వెళ్ళిపోతుంటే చూస్తూ "పేదవాళ్లు ధనవంతుల్ని అభిమానించరు' అని నేను, వాళ్ళతో కలిసిమెలిసి తిరిగితే తప్పక అభిమానిస్తారని సీత ఇక్కడకు రాకముందు వాదించుకున్నామోయ్. కాని వీళ్ళతో కలిసి తిరిగాక నా అభిప్రాయం మారింది. సుబ్బయ్య మనవరాలే గెలిచింది" అన్నాడు రాజా సీతవైపు చూస్తూ.

"నా అభిప్రాయం కూడా మారిందోయ్ రాజా! గొప్పవాళ్ళకు పేదవాళ్ళతో కలిసి తిరగడం, మాట్లాడటమంటే అసహ్యం-అనుకునే వాడిని. అలా వాళ్ళతో స్నేహంగా వుండాలనుకునే గొప్పవాళ్ళు కోటికొక్కరు కూడా వుండరనుకున్నాను. ఇవాళ మీరిద్దరూ నా వాదన తలకిందులు చేశారు" అన్నాడు శర్మ.

సీత లోపల ఏమనుకుంటుందో తెలీదు.

ఆ రోజు వాళ్ళకు అతిథిగా వుండి మర్నాడు శర్మ వెళ్ళిపోయాడు.

మరోవారం వుండడానికి నిశ్చయించుకున్నారు ఇరువురూ. వెళ్ళేరోజు దగ్గర పడుతుంటే మనసులు భారమౌతున్నాయి ఇద్దరికీ.

ఆ రోజు రానే వచ్చింది.

మనసులో ఆ ఊరి దృశ్యాన్ని ముద్రించుకుంటున్నట్టు ఓసారి ఊరంతటినీ కలియజూసింది సీత.

బస్సు రోడ్డువరకు వచ్చారు భీమయ్య తదితరులు.

బస్తీకెళ్లే బస్సు దూరంగా వస్తూ కనిపించింది.

"అయ్యా సెలవు తీసుకుంటాము"అన్నాడు భీమయ్య. "బాబూ! దండాలు!" అని ఒకరొకరూ ముందుకు వచ్చి సీతక్కూడా మరీ మరీ చెప్పారు.

అందరి గుండెలు బరువెక్కాయి.

కొందరు తలపాగాలు వూడదీసుకుని కళ్ళు నులుముకున్నారు. ఆడాళ్ళు కొందరు కన్నీరు తుడుచుకోకుండానే నిలబడ్డారు.

సీత బస్సులోకి ఎక్కి చిరునవ్వుతో అందరికీ చేయి వూపింది. "వీలైనప్పుడల్లా మీ ఊరు మాకు వేసవి విడిది అవుతుందిలే భీమయ్యా! నేను రానన్నా మీ సుబ్బయ్య మనవరాలు వూరుకోదు."

బస్సు ఎక్కేముందు రాజా అలా నవ్వుతూ అన్నమాటలు మిగుల్చుకున్నారు ఆ ఊరు వాళ్ళు.

బస్సు కదిలిన తర్వాత కంట్లో ఏదో నలుసు పడిందని కళ్ళు నులుముకుంది సీత.

★